క్లుప్తంగా

తప్పుడు ప్రచారంపై ఆగ్రహం



మాట్లాడుతున్న పెద్దహరివాణం సర్పంచ్ రాముడు

ఆదోని రూరల్: 'నాకు ఎక్కడా అవమానం జరగలేదు, నా సమక్షంలోనే బుధవారం పెద్దహరివాణం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం జరిగిందని పెద్దహరివాణం సర్పంచ్ రాముడు స్పష్టం చేశారు'. గురువారం పెద్దహరివాణంలోని సచివాలయం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తనకు రాజకీయ భిక్ష పెట్టింది గ్రామ నాయకులు, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అని చెప్పారు. ఎల్లో మీడియాకు చెందిన ఓ దినపత్రికలో 'దళిత సర్పంచ్‌కు దక్కని గౌరవం' పేరుతో తప్పుడు వార్త ప్రచురించడాన్ని ఆయన ఖండించారు. ఉద్దేశపూర్వకంగా ఇలాంటి లేనిపోని వార్తలు రాసి అవమానపరచడంపై కోర్టుకు వెళతామన్నారు. సమావేశంలో వాటర్‌షెడ్ వైస్ చైర్మన్ టి.పి.రామలింగప్ప, వార్డు సభ్యుడు గాలింగప్ప, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, పుప్పాలదొడ్డి మల్లప్ప, యశ్వంత్‌కుమార్ ఉన్నారు.

పాఠశాల స్థాయి పెంపు

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని అమరావతి నగర్‌లో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలలో మూడు నుంచి తొమ్మిదవ తరగతి వరకు 349 మంది విద్యార్థులు ఉన్నారని ప్రధానోపాధ్యాయురాలు కోమలదేవి తెలిపారు. ప్రస్తుతం అరు గదులు ఉన్నాయన్నారు. సబ్జెక్టుల ప్రకారం పది మంది ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. నాడు –నేడు కింద పాఠశాల అభివృద్ధికి రూ. 50 లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఈ నిధులతో రెండు తరగతి గదులు, కిచెన్, బాత్ రూమ్, టాయిలెట్స్ ఏర్పాటు పనులు చేస్తున్నట్లు చెప్పారు. పాఠశాల స్థాయి పెంపుపై హర్షం వ్యక్తం చేశారు.

సీపీఐ మండల కార్యదర్శి మృతి



ఎల్లప్ప (ఫైల్)

మంత్రాలయం: సీపీఐ మంత్రాలయం మండల కార్యదర్శి ఎల్లప్ప అనారోగ్యంతో గురువారం మృత్యువాత పడ్డారు. ఆ పార్టీ నేతలు, వైస్సార్‌సీపీ నేతలు ఆయన పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళి ఘటించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాలతో జనార్దన్ రెడ్డి, వెంకటరెడ్డి రూ.10 వేలు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమిరెడ్డి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని బాధిత కుటుంబసభ్యులకు అందజేశారు. సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వార్డు మెంబర్లు నివాళులర్పించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఆదోని టౌన్: పట్టణంలోని ఈఎస్ఐ ఆస్పత్రి చేరువలో రైల్వే ట్రాక్ పక్కనే ఉన్న వైఎస్సార్ కాలనీలో గురువారం త్రుటిలో అగ్ని ప్రమాదం తప్పింది. క్రాంతినగర్, వెంకన్నపేట ప్రాంతాలకు చెందిన రైతులు కల్లంలో గడ్డివాములను ఏర్పాటు చేసుకున్నారు. అయితే శ్రీసాయి నగర్‌లో ఓ ప్లాట్‌లో పెరిగిపోయిన ముళ్లపొదలు, గడ్డి, చెత్తా చెదారాన్ని తొలగించి నిప్పు పెట్టారు. గాలికి మంటలు ఎగిసిపడ్డాయి. రవ్వలు గడ్డివాములకు దగ్గరగా పడి రోడ్డుపక్కనే ఉన్న చెత్తాచెదారం అంటుకుంది. అంతలో స్థానికులు గుర్తించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ ఇంజిన్ సకాలంలో వచ్చి మంటలను ఆర్పి వేసింది. ఫైరింజన్ రాకపోయుంటే రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షలు విలువ చేసే గడ్డివాములు అగ్నికి ఆహుతై ఉండేవని రైతులు చెబుతూ ఊపిరి పీల్చుకున్నారు.

పక్కా ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ నిర్వహిస్తున్న ఏఈ గోపినాథ్‌వర్మ

కౌతాళం: మండల పరిధిలోని కుంటనహాల్ గ్రామంలో వరసిద్ధి వినాయక కంపెనీ ఆధ్వర్యంలో పక్కా ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు హౌసింగ్ ఏఈ గోపినాథ్‌వర్మ, గ్రామ ఇన్‌చార్జ్ శివరాం, సర్పంచ్ పార్వతమ్మ తెలిపారు. గ్రామానికి మంజూరైన 91 ఇళ్లను థర్డ్ పార్టీ విధానంలో సదరు కంపెనీ ద్వారా నిర్మించనున్నట్లు తెలిపారు. ఈమేరకు గురువారం హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అవోపా సేవలను సద్వినియోగం చేసుకోండి

ఆదోని అర్బన్: ఆర్యవైశ్య అఫీషియల్స్ ప్రొఫెషనల్ అండ్ అసోసియేషన్ (అవోపా) సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అవోపా అధ్యక్షుడు వంకదారు శ్రీనాథ్‌గుప్తా సూచించారు. గురువారం స్థానిక వాసవీ కల్యాణ మండపంలో.. ఈనెల 3వ తేదీన 258 మంది రోగులకు ఉచితంగా చెకప్ చేయగా అర్హులైన వారందరికీ కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఇంకా కొన్ని కంటి ఆపరేషన్ల క్యాంపులు ముందు ముందు చేస్తామని సెక్రటరీ మిరియాల శ్రీధర్ తెలిపారు. వీటన్నింటికీ తాను దాతగా ఉంటానని కాకుబాల్ నగేష్ తెలిపారు. కర్నూలు విశ్వభారతి ఆస్పత్రి నుంచి డాక్టర్ సురేష్ బృందం, అవోపా సభ్యులు పాల్గొన్నారు.







ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు, ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్ఐ

భక్తిశ్రద్ధలతో బక్రీద్



ఆదోనిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కౌతాళం: త్యాగనిరతికి ప్రతీక బక్రీద్ పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కౌతాళంతో పాటు మండల పరిధిలోని కుంటనహల్, హల్వి, నదిచాగి, ఎరిగేరి, కామవరం, బదినేహల్, ఉప్పరహాల్, చిరుతపల్లి, చూడి గ్రామాల్లో తెల్లవారుజామున 5 గంటలకు ఫజర్ నమాజ్ తర్వాత ఉదయం 7:30 గంటలకు మసీద్‌లకు చేరి నమాజ్ చదువుకుంటూ ఈద్గా వరకు పాదయాత్రగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సన్మార్గంలో నడుస్తూ అల్లా కృపకు పాత్రులు కావాలని మతపెద్దలు సూచించారు. గురువు మౌలన మాలిక్ మాట్లాడుతూ నమాజు విశిష్టత వివరించారు. స్తోమత కల్గిన ముస్లింలు ఖుర్బానీ ఇవ్వాలని పిలుపునిచ్చారు. జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో ధర్మకర్త సయ్యద్ మున్నాపాష చిష్తీ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజులు ఆచారించి పండుగ శుభకాంక్షలు తెలుపుకున్నారు. కౌతాళంలో అందరూ సోదరభావంతో కలిసికట్టుగా పండుగ జరుపుకోవాలని ధర్మకర్త సూచించారు.

కోసిగి: స్థానిక జామియా, నూరాని సున్నీ, మదీనా, మసీద్ ఏ ఆక్సా మసీదుల నుంచి ముస్లింలు ర్యాలీగా బయలుదేరి రైల్వే గేటు సమీపంలోని ఈద్గా వద్దకు చేరుకున్నారు. అక్కడ మత గురువు హఫీస్ జిలాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజు చేశారు. త్యాగానికి ప్రతిరూపంగా నిలిచే బక్రీద్ రోజున సమస్త మానవాళికి శాంతి చేకూరాలని అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ ఏరిసా వలి, ఎస్ఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నతుంబళం, కల్లుకుంట, హెచ్.మురవణి, మేకడోణ, బసలదొడ్డి, పెద్దకడబూరు తదితర గ్రామాలలో గురువారం ముస్లింలు బక్రీద్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక మసీదు నుంచి ఆదోని రహదారిలో ఉన్న ఈద్గా వద్దకు ర్యాలీగా వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మత గురువులు జాకీర్‌బాషా, రహీమ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పేదలకు తమకు తోచిన సహాయం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, ఎస్ఐ శ్రీనివాసులు ఈద్గాకు వెళ్లి ముస్లింలకు పండుగ శుభకాంక్షలు తెలిపారు.

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలో ముస్లింలు గురువారం బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. జామియా (పెద్ద) మసీదుతో పాటు పట్టణంలోని 52 మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ఒకరికి ఒకరు అలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పేదలపై దయ, దాతృత్వం భక్తి కలగలిసిన పండుగే బక్రీద్ అని మత గురువులు పేర్కొన్నారు. అనంతరం కుర్బానీ సమర్పించి పలువురు మొక్కుబడులు తీర్చుకున్నారు.

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం, పెద్దతుంబళం, మదిరె, ఇస్వీ, కడితోట, మాంత్రికి, సాంబగల్లు, పెద్దపెండేకల్, నెట్టేకల్, దొడ్డనగేరి, బైచిగేరి తదితర గ్రామాల్లో గురువారం బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఆయా మసీదులు, దర్గాల వద్ద మతపెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. మతపెద్దలు పండుగ విశిష్టతను తెలియజేశారు. ప్రతిఒక్కరు సేవా భావాన్ని కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



కౌతాళం ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

మంత్రాలయం: మండల కేంద్రంతోపాటు వగరూరు, మాధవరం, రాంపురం, మాలపల్లి గ్రామాల్లో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే మసీదుల నుంచి ర్యాలీగా బయలుదేరి ఈద్గాలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్థానిక జామియా మసీదు నుంచి ర్యాలీగా 167 జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈద్గాకు చేరుకున్నారు. అక్కడ ఈద్గా స్థలం సరిపడక జాతీయ రహదారిపైనే ప్రార్థనలు కానిచ్చారు. మసీదు ఇమాం ఖాజా బందెనవాజ్ బక్రీద్ విశిష్టతను ప్రవచించారు. సీఐ శ్రీనివాసులు నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



జాతీయ రహదారిపై ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ప్రజా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం

ఆదోని టౌన్: ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి తనయుడు, యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం 36వ వార్డు భీరప్ప నగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని కౌన్సిలర్ సందీప్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా చైర్‌పర్సన్ బోయశాంత, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోజ్‌కుమార్ రెడ్డి, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి సభ్యులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 510 ఇళ్లను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో ఏ ఒక్కరికీ సెంటు ఇంటి స్థలం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్నకు లభిస్తున్న ప్రజాదరణ, ఆశీస్సులు చూసి ఓర్వలేకనే దుష్టశక్తులు ఏకమై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. 2024లోనూ మళ్లీ జగనన్నే సీఎం కావడం తథ్యమన్నారు. పట్టణాధ్యక్షుడు దేవా, వైస్ చైర్మన్ నరసింహులు, ఆర్ఐ జయరామిరెడ్డి, కౌన్సిలర్లు రఘునాథ్‌రెడ్డి, మహ్మద్‌స్వామి, నాయకులు రేణుక, తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న మనోజ్‌కుమార్ రెడ్డి

జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌ల నియామకం

మంత్రాలయం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగనన్న సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్‌లను కేంద్ర పార్టీ కార్యాలయం ప్రకటించింది. మంత్రాలయం నియోజకవర్గంలోని కోసిగి మండలానికి జేసీఎస్ ఇన్‌చార్జ్‌గా మురళీమోహన్‌రెడ్డి, మంత్రాలయం మండల ఇన్‌చార్జ్‌గా విశ్వనాథ్‌రెడ్డి, కౌతాళం మండల ఇన్‌చార్జ్‌గా వెంకట్రామిరెడ్డి, పెద్దకడబూరు ఇన్‌చార్జ్‌గా వరిచంద్రారెడ్డి నియమితులయ్యారు. జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల పనితీరును పర్యవేక్షించే బాధ్యతలు ఇన్‌చార్జ్‌లకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి.

ఆదోని నియోజకవర్గంలో..

ఆదోని టౌన్: వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆదోని నియోజకవర్గంలో జేసీఎస్ మండల, పట్టణ ఇన్‌చార్జ్‌లను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆదోని పట్టణానికి ఫయాజ్‌అహ్మద్, వెల్లాల మధుసూదన్‌శర్మ, ఆదోని మండలానికి హరివాణం నల్లారెడ్డిని నియమించారు.

ఫ్యాక్షన్ వీడి ప్రశాంతంగా జీవించండి



గ్రామస్తులకు సూచనలు చేస్తున్న డీఎస్పీ సీతారామయ్య

కోసిగి: గ్రామాల్లో కక్షలు, ఫ్యాక్షన్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దని, ప్రశాంతంగా జీవించాలని ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య సూచించారు. గురువారం రాత్రి కామన్‌దొడ్డి గ్రామంలో ఎస్ఐ రాజారెడ్డితో కలిసి గ్రామసభ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ.. క్షణికావేశంలో గొడవలు పడడం వల్ల కుటుంబాలు నాశనం అవుతాయని వివరించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సామరస్యంగా పరిష్కరించుకోవాలన్నారు. కామన్‌దొడ్డి గ్రామం సమస్యాత్మక గ్రామంగా ముద్రపడిందని, ఇకపై కలిసికట్టుగా ఉంటూ ప్రజల్లో మార్పు తీసుకొచ్చి మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రతిఒక్కరూ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఆన్‌లైన్ మోసాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కడుపునొప్పితో వృద్ధుడి ఆత్మహత్య

ఆదోని టౌన్: కోసిగికి చెందిన అయ్యన్న (70) కడుపునొప్పి తాళలేక గురువారం తెల్లవారుజామున ఇంటి వద్దనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కుమారుడు నరసప్ప, కుటుంబ సభ్యులు బాధితుడిని ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందినట్లు కోసిగి ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. మృతుడి కుమారుడు నరసప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడికి నలుగురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు సంతానం ఉన్నారు.

'నాడు-నేడు' ప్రగతి చూడు

- మారిన మంత్రాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల రూపురేఖలు
- పీఠాధిపతి సహకారంతో స్థల సమస్యను తీర్చిన ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి
- తీరిన గదుల కొరత, ఆహ్లాద వాతావణంలో విద్యాబోధన



రెండో దశ నాడు- నేడు పథకం కింద నిర్మాణంలో ఉన్న అదనపు గదులు



నాడు-నేడు మొదటి దశలో రూ.438.80 లక్షలతో నిర్మించిన 24 గదుల భవనం

మంత్రాలయం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. రాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు, ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కృషితో కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్థల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. ఇక్కడ 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 1100 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మంత్రాలయం, చెట్నేహళ్లి, కల్లుదేవకుంట, ఇబ్రహీంపురం, గంగవరం తదితర గ్రామాల నుంచి పేద విద్యార్థులు చదువుకుంటున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. ప్రభుత్వ బడులను బాగు చేసేందుకు నాడు-నేడు పథకాన్ని చేపట్టారు. ఈ నేపథ్యంలో మంత్రాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల అభివృద్ధికి అధికారులు శ్రీకారం చుట్టారు. మొదటి దశలో రూ.రూ.438.80 లక్షలతో 24 గదులను నిర్మించారు. ఈ ఏడాది జనవరి 22న పాఠశాలను ప్రారంభించారు. విద్యార్థులకు కొత్త గదుల్లో విద్యాబోధన నిర్వహిస్తున్నారు. అలాగే పాత గదులు 8 ఉన్నాయి. ఈ క్రమంలో నాడు-నేడు రెండోవిడత కింద రూ.2 కోట్లతో మరో 16 గదులు మంజూరయ్యాయి. ఇప్పటికి ఉన్న విద్యార్థుల సంఖ్యకు గదులు సరిపోతాయని అందులో ఆరు గదులను మాత్రమే నిర్మిస్తున్నారు. 20 సెక్షన్లు, 38 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

గదులు, ఉపాధ్యాయుల కొరత లేదు.

రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతి సుజయీంద్రతీర్థులు విద్యాభివృద్ధి కోసం స్థలాన్ని కేటాయించారు. ఇందులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నిర్మించారు. ప్రస్తుత పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు ఇదే పాఠశాలలో చదువుకున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి మంత్రాలయానికి రూ.2 కోట్లతో ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియం మంజూరు చేశారు. మఠం అధికారులను సంప్రదించకుండా, స్థానిక నాయకులను పట్టించుకోకుండా అప్పటి అధికారులు స్టేడియం నిర్మాణానికి పూనుకున్నారు. దీంతో మఠం అధికారులు, ప్రభుత్వ అధికారుల మధ్య అభిప్రాయ బేధాలు వచ్చాయి. మఠానికి సంబంధించిన స్థలంలో స్టేడియం ఎలా నిర్మిస్తారని స్టే తీసుకొచ్చారు. ఆ తర్వాత పాఠశాలను ఇక్కడి నుంచి మార్చాలని మఠం అధికారులు ఒత్తిడి తెచ్చారు. అనంతరం అధికారం చేపట్టిన తెదేపా ప్రభుత్వం దీన్ని ఏమాత్రం పట్టించుకోలేదు. ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు గదుల నిధులు వెనక్కి వెళ్లాయి. పునాదుల్లోనే స్టేడియం నిర్మాణం ఆగిపోగా నిధులు మళ్లించారు. తర్వాత అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నాడు-నేడు పథకం కింద పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. అప్పటికే స్థల సమస్యతో నలిగిపోతున్న పాఠశాలను కాపాడేందుకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ముందుకొచ్చారు. పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు, మఠం అధికారులతో పలుమార్లు చర్చలు జరిపారు. చివరికి మఠం అధికారులు పాఠశాల కోసం స్థలాన్ని కేటాయిస్తున్నట్లు అంగీకరించారు. దీంతో స్థల సమస్య పరిష్కారం అయ్యింది. నాడు-నేడు పథకం కింద గదులను నిర్మించడంతో పాఠశాల రూపురేఖలు మారిపోయాయి.

ఏ సమస్యలు లేవు



నేను వచ్చిన కొత్తలో పాఠశాలలో గదుల కొరత తీవ్రంగా ఉండేది. నాడు-నేడుతో ఆ సమస్య తీరింది. ఎమ్మెల్యే సహకారంతో స్థల సమస్య తీరింది. ఉపాధ్యాయులు తగినంత మంది ఉన్నారు. గదులు అదనంగా ఉన్నాయి. నీరు, మరుగుదొడ్లు ఇలా అన్ని సౌకర్యాలు ఉన్నాయి. నాడు-నేడు రెండో విడత కింద మరో ఆరు గదుల నిర్మాణం కొనసాగుతోంది. ప్రస్తుతం పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఎలాంటి ఇబ్బందులు లేవు.

– ఎస్.హంపయ్య, హెచ్ఎం, మంత్రాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

గదులు చాలా బాగున్నాయి



పాత గదుల్లో వర్షం వస్తే నీరు కారేవి. వరండాలో కూర్చోవాలన్నా ఇబ్బందికరంగా ఉండేది. అదనపు గదులు నిర్మించాక పాఠశాల చాల బాగుంది. ఇప్పుడు గదుల సమస్య లేదు. పాఠశాలలో ఎలాంటి ఇబ్బందులు లేవు.

– భార్గవి, 9వ తరగతి, మంత్రాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలను ఖర్చుచేస్తోంది. విద్యార్థులకు కావల్సిన దుస్తులు, బూట్లు, పుస్తకాలు, తాగునీరు, గదులు, మరుగుదొడ్లు ఇలా అనేక సౌకర్యాలను కల్పించింది. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు బాగా చదువుకోవాలి. ఉన్నత శిఖరాలకు చేరుకోని పాఠశాలకు గుర్తింపు తేవాలి.

– రామన్న, ఉపాధ్యాయుడు, మంత్రాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు



భక్తులకు తప్త ముద్రధారణ చేస్తున్న మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు



ఆదోనిలో పూజలందుకుంటున్న నల్లకొండ పాండురంగ స్వామి

మంత్రాలయం: హిందువుల పవిత్ర ఆషాడ మాసం ప్రథమ ఏకాదశి వేడుకలు ఉపవాస దీక్షలతో పవిత్రంగా జరుపుకున్నారు. మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు బెంగళూరులోని జయనగర్ ఎస్ఎస్ఆర్ఎస్ మఠంలో వేడుకలు చేపట్టారు. మఠంలోని బృందావనానికి తులసీమాల సమర్పణతో ప్రత్యేక పూజలు గావించారు. అర్చకులచే శాస్త్రోక్తంగా సుదర్శన హోమం నిర్వహించారు. ఆనవాయితీలో భాగంగా భక్తులకు తప్త ముద్రధారణ చేశారు. ఆషాడమాసం తొలి ఏకాదశితో చాతుర్మాస దీక్షలు ప్రారంభమవనున్నాయి. నేటి నుంచి భక్తులకు తప్త ముద్రధారణ గావిస్తారు. అనంతరం భక్తులకు ఏకాదశి విశిష్టతను ప్రవచించారు. విష్ణుమూర్తి శయనంతోనే ప్రథమ ఏకాదశి మొదలుతుందని పేర్కొన్నారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు.

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆలయాల్లో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. ఆదోని పట్టణ శివారులోని ఇస్వీ రోడ్డులో వెలిసిన శ్రీ నల్లకొండ పాండురంగ స్వామి వారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఆయా ఆలయాల వద్ద అన్నదానం ఏర్పాటు చేశారు. భక్తుల రాకతో ఆలయ ప్రాంగణాలు కిటకిటలాడాయి.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లకొండ పాండురంగ స్వామి దేవాలయంలో ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు శాలువా, పూలమాలలు వేసి స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏకాదశి పర్వదినాన అందరికీ మంచి జరగాలని, సకాలంలో వర్షాలు కురిసి రైతులు పాడి పంటలతో కళకళలాడాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, పార్టీ నాయకులు, కార్యకర్తలు వెంట ఉన్నారు.



ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి శాలువాతో స్వాగతం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు

మంత్రాలయంలో భక్తుల కోలాహలం



దర్శన క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠంలో భక్తుల కోలాహలం నెలకొంది. ఆషాడమాసం శయన తొలి ఏకాదశి కావడం, బక్రీద్ పర్వదినం సెలవు రావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే భక్తులు దర్శనార్థం బారులు తీరారు. రాఘవేంద్రుల మూల బృందావన దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. ఏకాదశి సందర్భంగా భక్తులకు బృందావన నిజరూప దర్శనం కల్పించారు. కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. మంత్రాలయంలోని జాతీయ రహదారితోపాటు వీధులన్నీ వాహనాలతో కిక్కిరిశాయి. ఏకాదశి కావడంతో శ్రీమఠంలో భోజనాలకు, పరిమళ ప్రసాదాలకు విరామం ఇచ్చారు. ఈ నేపథ్యంలో హోటళ్లు, ప్రైవేటు లాడ్జీలు, టిఫిన్ సెంటర్లు భక్తుల తాకిడితో కిటకిటలాడాయి. మఠం మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, ధార్మిక సహాయక అధికారి వ్యాసరాజాచార్ భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండలం పరమాన్‌దొడ్డి తండా గ్రామంలోని ఎస్ఎంకేవీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995-96లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల సమేళనం గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో స్థిరపడిన విద్యార్థులు 27 సంవత్సరాల తర్వాత కలవడంతో వారిలో ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. నాటి తీపిగుర్తులను నెమరువేసుకున్నారు. వీరికి పాఠాలు బోధించిన గురువులు లక్ష్మీరెడ్డి, సత్యనారాయణరెడ్డి, రామూర్తి, జానకిరామిరెడ్డి, లక్ష్మికాంతరెడ్డిలను ఘనంగా సన్మానించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

కౌతాళం: మండల పరిధిలోని పొదలకుంట గ్రామంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లయ్య ఆధ్వర్యంలో కర్నూలు అమీలియా ఆసుపత్రి వైద్యులు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. 125 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 25 మందికి ఆపరేషన్లు అవసరం కాగా కర్నూలుకు రెఫర్ చేసినట్లు చేశారు. మిగతా వారికి మందులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సహకారంతో ఆ 25 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేయనున్నట్లు వైద్యుడు ఈరన్న తెలిపారు.



కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం

దరఖాస్తు చేసుకోండి

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని ఆదర్శ (మోడల్) పాఠశాలలో 7, 8, 9వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ రంగన్న తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ 7, 8వ తరగతిలో ఒక్కో సీటు, 9వ తరగతిలో రెండు సీట్లు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. అర్హులైన విద్యార్థులు ఈ శనివారం సాయంత్రంలోగా స్థానిక పాఠశాలలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మంగళవారం ప్రవేశ పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు.

తహసీల్దార్ నిర్ణయం మేరకు చర్యలు

మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండలం చౌలహళ్లి గ్రామంలో సర్వే నంబరు 19/బీ1ఏ లోని 2.89 ఎకరాల భూ వివాదంపై మండల తహసీల్దార్ చంద్రశేఖర్ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని మాధవరం ఎస్ఐ కిరణ్‌బాబు గురువారం తెలిపారు. ఈ భూమి తనదంటే తనదని గ్రామానికి చెందిన హరిజన ముత్తమ్మ, హరిజన దేవదాసు, మరో తొమ్మిది మంది మధ్య వివాదం ఉంది. దీంతో ఈ స్థలం ఎవరిదో తేల్చాలని తహసీల్దార్‌ను ఆశ్రయించారు. తహసీల్దార్ నిర్ణయం తర్వాత చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పేర్కొన్నారు.

దర్గాకు పోటెత్తిన భక్తులు



ఖాదర్‌లింగ స్వామి దర్గాలో పూజలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దర్గా పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో నిండిపోయాయి. బక్రీద్ పండుగ పర్వదినంతో పాటు సెలవు దినం కావడంతో భక్తులు అధికంగా వచ్చారు. అంతకుముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. సాయంత్రం దర్గాలో సలాముల ఆలాపన, ఖాదర్‌లింగస్వామి ప్రవచనాలు ఆలపించారు.